నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
13 | హైదరాబాద్, బుధవారం 7 ఫిబ్రవరి 2024 | YADADRI BHUVANAGIRI

## పట్టభద్రుల ఓటు నమోదుకు 33,827 దరఖాస్తులు

యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ) : పట్టభద్రుల ఓటు నమోదుకు గడువు ముగిసింది. మంగళవారం సాయంత్రం వరకు దరఖాస్తులను స్వీకరించారు. జిల్లాలో గ్రాడ్యుయేట్ ఓటరు నమోదుకు మొత్తంగా 33,827 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో ఆన్‌లైన్‌లో 33,678, ఆఫ్‌లైన్‌లో 149 అప్లికేషన్లు వచ్చాయి. వీటిల్లో ఆన్‌లైన్‌లో 7,513, ఆఫ్‌లైన్‌లో 30 దరఖాస్తులను ఆమోదించగా, 589 తిరస్కరించారు. 25,695 అప్లికేషన్లు పెండింగ్‌లో ఉన్నాయి. భువనగిరి మండలం నుంచి అత్యధికంగా 4,966 దరఖాస్తులు వచ్చాయి. ఆ తర్వాత చౌటుప్పల్‌లో 3,766, వలిగొండలో 3,557, రామన్నపేటలో 2,539, ఆలేరులో 2,059, యాదగిరిగుట్టలో 1,920 దరఖాస్తులు స్వీకరించారు. కాగా వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఉన్న పల్లా రాజేశ్వర్ రెడ్డి జనగాం ఎమ్మెల్యేగా పోటీ చేసి విజయం సాధించారు. దాంతో ఆయన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ నేపథ్యంలో మళ్లీ ఓటరు నమోదుకు అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. 2023 నవంబర్ ఒకటి నాటికి డిగ్రీ పూర్తయ్యి మూడేండ్లు నిండిన వారందరూ దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఈ నెల 21న ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల చేస్తారు. ఈ జాబితాపై 24నుంచి మార్చి 14వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. ఈ నెల 24 నుంచి మార్చి 14 వరకు మరోసారి ఓటరుగా నమోదు చేసుకోవడానికి అవకాశం ఉంటుందని అధికారులు చెప్పారు. ఏప్రిల్ 4న తుది జాబితాను విడుదల చేస్తారు.



స్వామి, అమ్మవార్లకు లక్ష పుష్పార్చన నిర్వహిస్తున్న అర్చకులు

# నీలగిరి వేదికగా నీళ్ల యుద్ధం

## కేఆర్‌ఎంబీకి సాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల అప్పగింతపై సమరభేరి

- ఈ నెల 13న బీఆర్‌ఎస్ చలో నల్లగొండ
- కృష్ణపట్టె రైతులతో భారీ బహిరంగ సభ
- కాంగ్రెస్ సర్కార్ వైఫల్యాన్ని ఎండగట్టడమే లక్ష్యం



తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌తో ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, ఎంపీ బడుగుల, ఉమ్మడి జిల్లా నేతలు

నల్లగొండ ప్రతినిధి, ఫిబ్రవరి6(నమస్తే తెలంగాణ)

కృష్ణానదీ జలాలపై పెత్తనాన్ని వదులుకునేందుకు సిద్ధపడ్డ కాంగ్రెస్ సర్కారుపై బీఆర్‌ఎస్ సమర శంఖం పూరించింది. నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టులను కేఆర్‌ఎంబీకి అప్పగించడాన్ని బీఆర్‌ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. ప్రాజెక్టులను కాపాడుకునేందుకు కృష్ణపట్టె రైతులతో కలిసి గర్జనకు సిద్ధమవుతున్నది. అందుకు వేదికగా నల్లగొండను ఎంచుకున్నది. ఈ నెల 13న నల్లగొండ కేంద్రంగా భారీ బహిరంగ సభను తలపెట్టింది. ఈ సభ ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వ తెలంగాణ వ్యతిరేక ధోరణిని ఎండగట్టాలని బీఆర్‌ఎస్ భావిస్తున్నది.

నీళ్లు-నిధులు-నియామకాలు నినాదంతోనే సాగిన ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో బీఆర్‌ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ కృష్ణా జలాల సాధనకు నడుం బిగించారు. 2004లోనే సాగర్ ఎడమ కాల్వ నీటి హక్కుల కోసం కోదాడ నుంచి హాలియా వరకు పాదయాత్రతో పోరు సైరన్ మోగించారు. అక్కడి నుంచి ఇటీవల బీఆర్‌ఎస్ సర్కార్ ఉన్నంత వరకు కృష్ణా జలాల్లో రాష్ట్ర వాటా కోసం నిరంతరం ప్రయత్నించారు. రాష్ట్రాన్ని సాధించి కేసీఆర్ సీఎం అయ్యాక నీటి వాటాలో నిక్కచ్చిగా వ్యవహరిస్తూ కృష్ణపట్టె రైతుల ప్రయోజనాలను కాపాడారు. శ్రీశైలంతోపాటు నాగార్జునసాగర్ ప్రాజెక్టుల్లో నీటి వాటాను వినియోగించుకోవడంలో ఎన్నడూ రాజీ పడలేదు. అందుకే పదేండ్లలో 18 సార్లు సాగర్ ఆయకట్టుకు సాగునీటిని అందించి కొత్త చరిత్ర లిఖించారు. టెయిల్‌ఎండ్ భూములకు సైతం సాగునీరు అందేలా చర్యలు చేపట్టి ఆయకట్టు రైతుల మన్ననలను పొందారు. శ్రీశైలం ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద మొదలైన మర్నాడే విద్యుత్ ఉత్పత్తి ద్వారా ఆ నీటిని సాగర్‌కు తరలించి నిల్వ చేస్తూ వచ్చారు. దాంతో సాగర్ ఆయకట్టుకు సైతం సకాలంలో సాగునీటి విడుదలకు ఆస్కారం కలిగేది. ఒక్కోసారి శ్రీశైలం పూర్తిగా నిండి గేట్లు ఎత్తే సరికి విద్యుత్ ఉత్పత్తి ద్వారా సుమారు 30 అడుగుల నీటిని సాగర్‌కు తరలించిన సందర్భాలు ఉన్నాయి. ఇదంతా శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టులపై రాష్ట్ర ప్రభుత్వ అధికారాలతో సాధ్యమైంది. కానీ ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ ఈ రెండు ప్రాజెక్టులను కేంద్ర ప్రభుత్వం పరిధిలోని కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు(కేఆర్‌ఎంబీ) అప్పగిస్తూ గత నెల 17న జరిగిన సమావేశంలో నిర్ణయం తీసుకున్నది. దాంతో ఒక్కసారిగా ఆయకట్టు రైతుల్లో ఆందోళన మొదలైంది. తిరిగి సమైక్య రాష్ట్రంలోని పరిస్థితులే తలెత్తుతాయన్న ఆందోళన నెలకొంది. మరోసారి రైతులకు అండగా నిలిచేందుకు ఆది నుంచి కృష్ణా జలాల్లో నీటి వాటా కోసం నిక్కచ్చిగా వ్యవహరిస్తున్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ నడుం బిగిస్తున్నారు. అందులో భాగంగా ఈ నెల 13న నల్లగొండ గడ్డ మీదినుంచి కాంగ్రెస్ సర్కార్‌పై సమర శంఖం పూరిస్తున్నారు.

### నల్లగొండలో భారీ బహిరంగ సభ

తెలంగాణ భవన్‌లో కృష్ణానదీ పరివాహక ప్రాంత జిల్లాలైన నల్లగొండ, మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాల ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు, ముఖ్యులతో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ మంగళవారం సమావేశమయ్యారు. కాంగ్రెస్ సర్కార్ నిర్వాకంతో తలెత్తే సమస్యలపై చర్చించారు. కృష్ణా జలాల పంపిణీ పూర్తికాకముందే కాంగ్రెస్ సర్కార్ ప్రాజెక్టులను అప్పగించడాన్ని తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు అధినేత కేసీఆర్ వెల్లడించారు. ఈ నెల 13న మధ్యాహ్నం 2 గంటలకు నల్లగొండ జిల్లా కేంద్రంలో సభను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. సభకు కృష్ణపట్టె ప్రాంతంలోని రైతాంగం యావత్ తరలిరావాలని పిలుపునిచ్చారు. దాంతో నల్లగొండ, మహబూబ్‌నగర్, ఖమ్మం, రంగారెడ్డి తదితర జిల్లాల నుంచి పెద్దఎత్తున రైతులు తరలివచ్చేలా విస్తృతంగా ప్రచారం నిర్వహించేందుకు బీఆర్‌ఎస్ సన్నద్ధం అవుతుంది. భారీ బహిరంగ సభ ద్వారా ఇటు కాంగ్రెస్ సర్కారుతో పాటు అటు కేంద్ర ప్రభుత్వానికి కూడా హెచ్చరిక చేయాలని భావిస్తున్నారు. కృష్ణా నదిలో తెలంగాణ హక్కులను వదులుకోబోమని, నీటి వాటాలు, ఇతర విషయాలు తేలే వరకు ప్రాజెక్టులను కేఆర్‌ఎంబీ పరిధిలోకి పోకుండా అడ్డుకోవడమే తమ లక్ష్యమని బీఆర్‌ఎస్ ఈ సభ ద్వారా చాటి చెప్పనున్నది.



తెలంగాణ భవన్‌లో సమావేశానికి హాజరైన బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు

## లక్ష్మీనరసింహుడికి లక్ష పుష్పార్చన

- గుట్టలో వైభవంగా స్వామి, అమ్మవార్లకు నిత్యోత్సవాలు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 6 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ప్రధానాలయంలో మంగళవారం ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని లక్ష పుష్పార్చన పూజలు ఘనంగా జరిగాయి. స్వామి, అమ్మవార్ల సహస్రనామ పఠనాలతో అర్చకులు, వేద పండితులు వివిధ రకాల పూలతో లక్ష పుష్పార్చన పూజలు నిర్వహించారు. పాంచరాత్రగమ శాస్త్ర ప్రకారం సుమారు రెండు గంటల పాటు పూజలు కొనసాగాయి. తెల్లవారు జామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన, ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనభాగ్యం కల్పించారు. ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలోని కల్యాణ మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ హవనం జరిపారు. స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా ముస్తాబు చేసి గజవాహనంపై వేంచేపు చేసి వెలుపలి ప్రాకార మండపంలో ఊరేగించారు. లక్ష్మీనరసింహుడి నిత్య తిరుకల్యాణోత్సవం వైభవంగా సాగింది. సుమారు గంటన్నరకు పైగా జరిగిన కల్యాణ తంతును భక్తులు వీక్షించి తరించారు. ప్రధానాలయ ముఖ మండపంలో శ్రీవారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా భక్తులకు సువర్ణ పుష్పార్చన జరిపించారు. బంగారు పుష్పాలతో దేవేరులకు అర్చన చేశారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి సేవ, దర్బార్ సేవను ఘనంగా నిర్వహించారు. ప్రధానాలయం, క్యూ కాంప్లెక్స్, శివాలయంలో చెంతన గల క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి ఆకుపూజను ఘనంగా నిర్వహించారు.

హనుమంతుడిని సింధూరంతో అలంకరించి అభిషేకించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 10 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ. 17,70,079 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ రామకృష్ణారావు తెలిపారు.



చేనేత మగ్గాన్ని పరిశీలిస్తున్న ఫ్యాషన్ విద్యార్థుల బృందం

## పోచంపల్లి ఇక్కత్ చీరెలు అద్భుతం

భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 6 : ప్రపంచ ప్రసిద్ధి చెందిన పోచంపల్లి ఇక్కత్ పట్టు చీరెలు అద్భుతంగా ఉన్నాయని నిఫ్ట్ ఫ్యాషన్ మేనేజ్‌మెంట్‌కు చెందిన విద్యార్థులు పేర్కొన్నారు. హైదరాబాద్ నిఫ్ట్ ఫ్యాషన్ మేనేజ్‌మెంట్‌లో ఫస్టియర్ చదువుతున్న 13 మంది విద్యార్థుల బృందం మంగళవారం పోచంపల్లిలోని టూరిజం సెంటర్, చేనేత సహకార సంఘం, చేనేత కార్మిక గృహాలను సందర్శించింది. క్లస్టర్లు ఎలా ఉన్నాయి.. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా? ఇక్కడ తయారవుతున్న చీరెలకు డిమాండ్ తదితర అంశాల గురించి వారు తెలుసుకున్నారు.

# నాలుగు రోజులైనా వీడని మిస్టరీ

## విద్యార్థినుల మృతిపై తేల్చని పోలీసులు

## విషాదంపై అంతటా చర్చోపచర్చలు

## ఎట్టకేలకు వార్డెన్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు

- విచారణాధికారిగా నాగలక్ష్మి నియామకం
- కొనసాగుతున్న ఆందోళనలు
- హాస్టల్‌ను సందర్శించిన ఎమ్మెల్సీ కవిత
- ఆశ్రమ పాఠశాలలోకి టెన్త్ విద్యార్థులు!
- కొత్త భవనంలోకి హాస్టల్‌ను మార్చే యోచన



భువనగిరిలోని హాస్టల్ విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

పదో తరగతి విద్యార్థినుల ఆత్మహత్య మిస్టరీ వీడటం లేదు. విషాదం జరిగి నాలుగు రోజులైనా సూసైడ్‌కు గల కారణాలు ఇంకా తేలలేదు. జిల్లాలో ఎక్కడ చూసినా దీనిపై చర్చోపచర్చలు జరుగుతున్నాయి. మరోవైపు విధుల్లో నిర్లక్ష్యం వహించారని హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేశారు. భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత మంగళవారం ఎస్సీ హాస్టల్‌ను సందర్శించి, విద్యార్థులకు భరోసా కల్పించారు.

– యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ)

### ఆధారాలు సేకరించినా..

పట్టణంలోని ఎస్సీ హాస్టల్‌లో ఈ నెల 3వ తేదీన విద్యార్థినులు భవ్య, వైష్ణవి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఘటనా స్థలంలోనే సూసైడ్ లెటర్ బయటపడింది. ఇది జరిగి నాలుగు రోజులు గడుస్తున్నా ఆత్మహత్యలకు గల కారణాలు ఇంకా తేలలేదు. ఘటనపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు ఘటన రోజు, తెల్లారి వివరాలు సేకరించారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. విద్యార్థుల హ్యాండ్ రైటింగ్ సూసైడ్ నోట్ ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. నాలుగు రోజులుగా దర్యాప్తు చేస్తున్నా ఇప్పటి వరకు పోలీసులు ఎలాంటి ప్రకటన చేయలేదు.

### వార్డెన్ సస్పెన్షన్

విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు ఎస్సీ హాస్టల్ వార్డెన్ శైలజను ఎట్టకేలకు సస్పెండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్ హన్మంతు కె.జెండగే మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రాథమిక విచారణ అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. కాగా ఘటనకు బాధ్యులను చేస్తూ విద్యార్థుల పేరెంట్స్ ఆరుగురిపై ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేశారు. కానీ ఒక్కరినే సస్పెండ్ చేయడంపై వివిధ వర్గాల నుంచి విమర్శలు వస్తున్నాయి.

### విచారణాధికారిగా నాగలక్ష్మి..

సూసైడ్ కేసు విషయంలో ఓ వైపు పోలీసులు దర్యాప్తు చేపడుతుండగా, మరోవైపు శాఖాపరమైన విచారణ చేపట్టనున్నారు. డిప్యూటీ కలెక్టర్ నాగలక్ష్మిని విచారణాధికారినిగా నియమించారు. ఈ మేరకు యాదాద్రి భువనగిరి కలెక్టర్ హన్మంతు కె. జెండగే ఉత్తర్వులు జారీ చేశారు.

### ఎస్సీ హాస్టల్‌ను సందర్శించిన ఎమ్మెల్సీ కవిత

కేంద్రంలో విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్న ఎస్సీ హాస్టల్‌ను భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సందర్శించారు. సూసైడ్ చేసుకున్న పరిస్థితులను తోటి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు వచ్చినా ధైర్యంగా ఉండాలని స్టూడెంట్స్‌కు భరోసా కల్పించారు. కేసును పారదర్శకంగా విచారించి, దోషులను కఠినంగా శిక్షించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

### విద్యార్థుల కోసం ఇతర భవనాల్లోకి..

ప్రస్తుతం సాయి కృప డిగ్రీ కళాశాలలో ఎస్సీ హాస్టల్ నడుస్తున్నది. ఇటీవల విద్యార్థుల ఆత్మహత్యతో స్టూడెంట్స్ భయాందోళనకు గురై హాస్టల్‌ను ఖాళీ చేశారు. తల్లిదండ్రులు దగ్గరుండి సొంతూర్లకు తీసుకెళ్లారు. పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతున్న నేపథ్యంలో టెన్త్ విద్యార్థులు ఇబ్బందులు పడకుండా అధికారులు చర్యలు చేపడుతున్నారు. హాస్టల్‌లో 14 మంది పదో తరగతి విద్యార్థులు చదువుతుండగా వారిని పట్టణంలోని ఆశ్రమ పాఠశాలలోకి తరలించాలని అధికారులు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. మిగతా తరగతుల విద్యార్థుల కోసం వేరే భవనం ఏర్పాటు చేయడం లేదా దగ్గరలోని ఇతర హాస్టళ్లు, కేజీబీవీలకు తరలించాలని భావిస్తున్నారు.

### జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఇన్‌చార్జి అధికారిగా శ్యాంసుందర్

జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఇన్‌చార్జి అధికారిగా జినుకుల శ్యాంసుందర్‌ని నియమించారు. ఈ శాఖ అధికారిగా ఉన్న జైపాల్ రెడ్డి సెలవులో ఉండడం, టెన్త్ విద్యార్థుల ఆత్మహత్య కేసులో వివిధ అంశాల్లో డీఎస్డీఓ కీలకంగా ఉండడంతో ఈయనను నియమించారు. ఈ మేరకు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

## ఉచితంగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు



క్యాన్సర్ పరీక్షల కోసం వివరాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

నల్లగొండ, ఫిబ్రవరి 6 : జిల్లా కేంద్రంలోని ఎన్జీ కాలనీలో గల శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి నివాసంలో మంగళవారం గుత్తా వెంకట్ రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. తొలి రోజు సియాన్ క్యాన్సర్ క్లినిక్స్ సౌజన్యంతో అంతర్జాతీ య ప్రమాణాలతో రేడియేషన్ రహితంగా ఓరల్ క్యాన్సర్‌తోపాటు బ్రెస్ట్ స్క్రీనింగ్ టెస్టులు చేశారు. ట్రస్ట్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి-అఖిల రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం పదిన్నర నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరిగిన పరీక్షలకు సుమారు వంద మంది మహిళలు హాజరయ్యారు. అదేవిధంగా క్లోవ్ డెంటల్ సౌజన్యంతో ఉచిత దంత పరీక్షలు కూడా నిర్వహించారు. ఈ ఉచిత పరీక్షలు బుధవారం కూడా నిర్వహించనున్నందున సద్వినియోగం చేసుకోవాలని ట్రస్ట్ చైర్మన్ అమిత్ రెడ్డి కోరారు. పూర్తి వివరాల కోసం 95423 08396 నంబర్‌ను సంప్రదించాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు జెండగే

## వార్డెన్లు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

- కలెక్టర్ హనుమంతు జెండగే

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 6 : తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టేలా వసతి గృహాల నిర్వహణ ఉండాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హనుమంతు జెండగే వార్డెన్లు, అధికారులను హెచ్చరించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం ప్రభుత్వ వసతి గృహాల వార్డెన్లు, సంక్షేమ అధికారులతో కలిసి వసతి గృహాల పనితీరును సమీక్షించారు. వార్డెన్లు స్నేహ పూర్వక వాతావరణంలో విద్యార్థుల ఆరోగ్యకరమైన విషయాలను పంచుకోవాలని, గార్డియన్‌గా విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు ఇచ్చే ఫిర్యాదులను అలక్ష్యం చేయవద్దని, విద్యార్థుల్లో అభద్రతాభావం కలుగకుండా చూడాలని తెలిపారు. సాయంత్రం 5 గంటల తరువాత ఎవరినీ వసతి గృహాల్లోకి అనుమతించవద్దని, కూరగాయలు, వసతులు సమకూర్చే వారిని సైతం పగటి సమయాల్లోనే వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కౌన్సిలింగ్ సెషన్స్ ద్వారా విద్యార్థుల్లో మనోధైర్యం పెరిగేలా కృషి చేయాలన్నారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్నందున ప్రతి ఒక్క విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని తెలిపారు. సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డి, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎ.భాస్కర్ రావు, ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్యాంసుందర్, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారి యాదయ్య, సహాయ సాంఘిక సంక్షేమ అధికారులు, ఆశ్రమ పాఠశాలల ప్రిన్సిపాల్స్, వసతి గృహాల వార్డెన్లు పాల్గొన్నారు.

## మహిళా శిశు సంక్షేమ శాఖ జేడీ విచారణ



ఎస్సీ వసతి గృహాన్ని సందర్శించిన మహిళా శిశు సంక్షేమశాఖ జేడీ

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 6 : భువనగిరిలోని ఎస్సీ వసతి గృహాన్ని మంగళవారం తెలంగాణ రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీదేవి సందర్శించారు. వసతి గృహంలో వసతులు, వంట మనిషి, ఘటన వివరాలపై ఆరా తీశారు. అనంతరం పట్టణంలోని ఏసీపీ కార్యాలయంలో విద్యార్థినుల ఆత్మహత్యకు సంబంధించిన కేసు వివరాలపై విచారించారు. సేకరించిన పూర్తి నివేదికను ప్రభుత్వానికి అందజేయనున్నట్లు చెప్పారు. ఆమెతో పాటు రీజినల్ జాయింట్ డైరెక్టర్ మోతి ఉన్నారు.

## విద్యార్థుల మృతిపై న్యాయ విచారణ జరిపించాలి

- మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి

ఎస్సీ హాస్టల్లో ఇద్దరు విద్యార్థుల ఆత్మహత్యపై న్యాయ విచారణ జరిపించాలని మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఘటన జరిగి నాలుగు రోజులైనా ఇప్పటివరకు ఆధారాలు గుర్తించకపోవడం ఏంటని మండిపడ్డారు. ఇద్దరు విద్యార్థుల మృతిపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని తెలిపారు. ఘటనకు బాధ్యులు ఎవరో నిగ్గు తేల్చాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పట్టిష్ట చర్యలు తీసుకోవాలని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## సమగ్ర విచారణ జరిపించాలి

- ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎల్.మూర్తి

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 6 : భువనగిరి ఎస్సీ వసతి గృహంలో జరిగిన విద్యార్థినుల ఆత్మహత్యపై సమగ్ర విచారణ చేపట్టి ప్రభుత్వం బాధితుల కుటుంబాలను ఆదుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎల్.మూర్తి కోరారు. భువనగిరి పట్టణంలోని ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో మంగళవారం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ హాస్టళ్లను గాలికి వదిలేశారన్నారు. కనీసం సొంత భవనాలు లేకపోవడం, సౌకర్యాలు లేక, రెగ్యులర్ వార్డెన్లు లేక విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అధికారుల పర్యవేక్షణ లోపంగానే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి వనం రాజు, ఉపాధ్యక్షుడు వేముల నాగరాజు, సభ్యులు ఈర్ల రాహుల్, గంగాదేవి సాయికుమార్, శుద్ధగోని పరమేశ్వర్, నాగరాజు, శివ పాల్గొన్నారు.





← సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎల్.మూర్తి



భువనగిరిలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

## ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే విద్యార్థుల మృతి

- భువనగిరిలో ఏబీవీపీ ధర్నా

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 6 : భువనగిరిలోని ఎస్సీ వసతి గృహంలో పదో తరగతి విద్యార్థినులు ఆత్మహత్య చేసుకోవడానికి ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత అని ఏబీవీపీ రాష్ట్ర సెక్రెటరీ ఝాన్సీ అన్నారు. ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యంతోనే ఇద్దరు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని నిరసన తెలుపుతూ ఏబీవీపీ ఆధ్వర్యంలో మంగళవారం భువనగిరి పట్టణంలోని బాబూ జగ్జీవన్‌రావ్ చౌరస్తాలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ వసతి గృహాల్లో లోపాలు ఉన్నాయని, తమకు బయటి వ్యక్తులతో ఇబ్బందులు జరుగుతున్నాయని విద్యార్థులు అధికారులు, సిబ్బందికి చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. భవ్యశ్రీ, వైష్ణవి ఆత్మహత్యకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఘటన జరిగి మూడు రోజులు గడుస్తున్నా ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గు చేటన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే విద్యార్థుల ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే తమ పోరాటం ఆగదని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ రంజిత్, నల్లగొండ విభాగ్ కన్వీనర్ సుర్వి మణికంఠ, జిల్లా కన్వీనర్ బుచ్చిబాబు, నాయకులు దీపిక, సాయిరాం, సాయి కిరణ్, శివ, నితిన్, సాయికుమార్, సిద్ధు, ప్రణయ్ పాల్గొన్నారు.

### విద్యార్థినుల కుటుంబాలను ఆదుకోవాలి

ఎస్సీ వసతి గృహంలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థినుల కుటుంబా లకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి, వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వాలని బీజేపీ పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కీర్తిరెడ్డి డిమాండ్ చేశారు. ఎస్సీ హాస్టల్‌ను మంగళవారం ఆమె సందర్శించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు సుర్వి లావణ్య, నాయకురాలు రాజమణి, మాధురి, వైజయంతి, రాణి, మాధవి, చంద్రలేఖ, విజయలక్ష్మి, రేణుక, మౌనిక, సుజాత, సుమిత్ర, సుమ మల్లిక, ప్రవళిక, కౌన్సిలర్లు రత్నపురం బలరాం జనగాం కవితానర్సింహాచారి, పట్టణ ప్రధాన కార్యదర్శి ఉడుత భాస్కర్ పాల్గొన్నారు.